

పెద్దకథ

# దేవతలు తిరిగేచోటు

-జయ

(గత సంచిక తరువాయి)

గుడి మెట్ల మీద తలవంచుకుని, దిగాలుగా కూర్చుని వున్న రామాన్ని చూసి శంకరం ఆశ్చర్యపోతూ – "ఏరా ... ఏమయ్యింది" అంటూ దగ్గరికి వచ్చి పక్కనే కూర్చున్నాడు.

శూన్యాన్ని నింపుకున్న స్వరంతో "అంతా అయిపోయింది" అన్నాడు.

"అదేవిటిరా – మీ అమ్మ పోయినప్పుడు, మీ నాన్న మిమ్మల్ని వదిలేసి బదరీ వెళ్ళినప్పుడు కూడా నువ్వు నిబ్బరంగా వున్నావు. ఇదేవిటి ఇలా –?"

"ఆ రోజు నాకు ఏకాకితనం లేదు. గుండె నిబ్బరం వుండేది. నాకు నేను వున్నాను అనుకున్నాను. కానీ ఈ రోజు నన్ను నేను రక్షించుకునేందుకు ఏమీ లేదు. మిగల్లేదు –" అంటూ నిరాసక్తంగా మాట్లాడుతూ – తల వాల్చేశాడు.

అతడి మాటలు శంకరానికి అర్థం అయ్యీ కాకుండా, అయోమయంలో పడేస్తే, ఇలా స్పృహ తప్పి పడిపోవడం విపరీతమైన కంగారుని కలిగించిది. గబుక్కున మొహం మీద నీళ్లు జల్లి, రామం నీరసంగా కళ్లు విప్పగానే లేపి తన రూమ్‌కి తీసుకువెళ్ళాడు.

రూమ్‌లో కూడా ఒక రకమైన ట్రాన్స్‌లో మాటకి మాట, వాక్యానికి వాక్యం పొసగని రీతిలో మాట్లాడుతున్న రామాన్ని చూసి, అతను తీవ్రమైన మానసిక వేదనకి గురవుతున్నట్టు శంకరం గ్రహించాడు.

వెంటనే వెళ్లి, ఒక హాఫ్ బ్రాందీ తెచ్చి ఛీర్స్ అన్నాడు. రెండు పెగ్గులు కళ్లు, ముక్కు మూసుకుని తాగగానే, అతనికి ఏవిటో తేలికయి పోయినట్టు, తన చుట్టూ అల్లుకున్న చీకటి విడివడుతున్నట్టు అనిపించింది. దాంతో మరో రెండు పెగ్గులు ... ఇప్పుడు అతనిలో అదో రకమైన పిచ్చి ధైర్యం వచ్చింది. శంకరం వారిస్తున్నా వినకుండా ఇంటికి బయల్దేరాడు.

** ** **

తలుపు తట్టిన శబ్దానికి వైదేహి, భర్త చేతుల్ని తప్పించుకుంటూ లేచింది. వచ్చింది రామం అని గ్రహించి బాధ్యతా రహితంగా తయారయిన మరిదిని తలుచుకుని విసుగ్గా లేస్తూ – "మరీ ఓపిక పడుతుంటే, మితిమీరిపోతున్నాడు. ఈ రోజుతో అన్నీ సరి. నిలబెట్టి అడిగెయ్యాలి –" అనుకుంటూ విసురుగా వచ్చి తలుపులు తీసింది.

చెదిరిన జుత్తుతో, నిలబడలేకుండా, తూలుతూ పీక్కుపోయిన మొహంతో, స్పిరిట్ కంపుతో – రామాన్ని అలా చూడగలనని కలలో కూడా వూహించలేదేమో తలుపు తీసి వైదేహి అలాగే నిలబడిపోయింది. గిల్లితే పాలుకారే పసితనపు లేతదనమే రామంలో చూసింది కానీ ఈ విపరీతపు విచ్చలవిడితనాన్ని చూసి స్థాణువై అతని మొహంలోకే నిశితంగా చూస్తుండిపోయింది.

అంతవరకు బ్రాంది ఇచ్చిన మత్తు ధైర్యంతో ఇంటికైతే వచ్చి, తలుపు తట్టాడు గానీ – వదిన చూపుల పదునుకి అతనిలోని వివేకం మేలుకొని, లజ్జాభారంతో క్రుంగిపోయి, గబుక్కున వెనక్కి తిరిగి గబగబ మెట్లు దిగబోయాడు.

వైదేహి గొంతు పెగుల్చుకుని – "రామం" అని పిల్చింది.

రామం ఆగి వెనక్కి తిరక్కుండా అలాగే నిల్చున్నాడు.

"ఏవిటిది రామం?"

రామంలో పెద్ద పెట్టున దుఃఖం వచ్చింది. ఎంత అమాయకంగా అడుగుతోంది. తను ఈ రోజు ఇలా అర్థం అయ్యీ, అవ్వని ఈ అనంతమైన దుఃఖసాగరంలో ఈదలేకుండా మునిగిపోయి, వూపిరి కోసం కొట్టు మిట్టాడుతున్నాడు అంటే ఈమె వలన కాదూ? తన సహజ జీవితం ఈవిడ కోసం కదూ వదిలిపెట్టి, ఈవిడ 'నీడ'లా తిరిగాడు. మనిషి, తన నీడని తన నుంచి వెలివేస్తే ఆ నీడ ఎక్కడకి వెళ్ళగలదు?

వైరాగ్యంగా ఒక నవ్వు నవ్వుకుని వెనక్కి తిరిగి, ఆ చీకటిని చీల్చుకుని వైదేహి మొహంలోకి సూటిగా చూస్తూ – "నీకు తెలీదూ?!" అని సమాధానం కోసం కూడా చూడకుండా కదిలాడు.

అప్పుడే మెలకువ వచ్చి, బయటకు వచ్చిన చంద్రం, భార్యని వుద్దేశించి – "ఏవిటి వాడు అర్థరాత్రి రావడం – లోపలికి రాకుండా వెళ్ళడం ఏవిటిదంతా?"

"ఏమో! తాగి వచ్చాడు. పైగా అర్థంకాని మాటలు మాట్లాడుతున్నాడు. స్పృహ వుండి మాట్లాడాడో లేక ..." వాక్యం ఎలా పూర్తి చెయ్యాలో తెలీక ఆగింది.

"ఇదివరకు ఎప్పుడూ ఇలా వుండేవాడు కాదు. వాడి చదువు, టెన్నిస్, ఫ్రెండ్స్ తప్ప. ఇప్పుడేవిటో ఫైనల్ ఎగ్జామ్స్ కూడా రాయకుండా, టెన్నిస్ మానేసి, ఫ్రెండ్స్‌కి దూరంగా, అర్థరాత్రిళ్లు ఒంటరిగా రోడ్లు పట్టుకుని తిరగడం – ఏవిటో వీడి పద్ధతి అర్థం కాకుండా వుంది" అన్నాడు.

వాళ్ల సంభాషణ ఆ నిశ్శబ్ద నీరవ నిశీధిలో లీలగా వినిపించి – 'ఇక ఆ ఇంట్లో వుండలేదు తను' అనుకుంటూ నడుస్తూ –

** ** **

అతనికి మెలకువ వచ్చింది. మెలకువతో పాటు వదిన, ఆవిడ ఆ రాత్రి చూసిన సూదైన చూపు, అంతకుముందు నిర్లక్ష్యపు ధోరణి గుర్తొచ్చాయి. వెంటనే గుండెలో వెయ్యి బాకులు దిగిన వేదన. తట్టుకోలేక మూలుగుతూ

పక్కకి ఒత్తిగిలి గతాన్ని మర్చిపోయి ప్రస్తుతంలో బ్రతకడానికి, ప్రస్తుతం నిద్ర పోవడానికి ప్రయత్నించాడు. కుదరలేదు. అంతకంతకు వేదన పెరిగిపోతోంది. అది శరీరం, హృదయం, మెదడు తట్టుకోలేక అతణ్ని సమూలంగా పెకిలించడానికి సిద్ధపదుతున్నంత కల్లోలం.

గబుక్కున లేచి, మంచం క్రింద వున్న కొత్త బాటిల్ తీసి ఓపెన్ చేసి, ఆ అర్థరాత్రి గబగబ గ్లాసులో పోసుకుని తాగడం మొదలెట్టాడు.

పక్క మంచం మీద పడుకున్న శంకరం ఎందుకో మెలకువ వచ్చి చూసేసరికి, రామం చీకటి నీడలో తాగుతూ కనిపించాడు.

"రామం ఏవిటిరా –" అంటూ మంచం మీద లేచి కూర్చున్నాడు.

రామం నిర్లక్ష్యంగా – "ఏవిటి అంటే ఏవిటి?" అంటూ మరో గుక్క మింగాడు.

స్పృహ, మెలకువ వచ్చినప్పుడల్లా వదినని, ఆవిడ తనని నిర్లక్ష్యం చేసి కించపరిచిన విధానం గుర్తుకు తెచ్చుకుని 'ఆ జ్ఞాపకాలు ఇంకా బాధని కలిగిస్తున్నాయా' అని జ్వరపీడితుడు థర్మామీటర్‌తో జ్వరం కొల్చుకున్నట్టు అతడు తన కాన్షస్ మైండ్‌తో కొలుచుకోవడం, ఆ కొలత మరీ 'హై'గా వుండటం, ఆది భరించలేక తాగడం, ఇది అనంతంగా సాగిపోవాల్సిందే అనే మరో వేదాంతపు ధోరణి.

శంకర్ స్నేహితుడి పరిస్థితికి విపరీతంగా ఫీల్ అవుతూ – ఏం చెయ్యాలో తెలీక, అయోమయం, విసుగుల మధ్య చిక్కుపడిపోయాడు.

** ** **

గేటు తీసుకుని తూలుతూ లోపలికి వస్తున్న అతణ్ని అప్పుడే కాలేజీ నుంచి వచ్చి, స్నానం చేసి ఫ్రెష్‌గా సన్నజాజి పందిరి క్రింద కూర్చుని ఇంగ్లీషు నోట్స్ రాసుకుంటున్న సారిక, బి.ఎ. సెకండియర్ ఇంగ్లీషు లిట్ చూసి స్టన్ అయ్యింది.

చీకటి వెలుతురుల మిశ్రమంలో వంగి నడుచుకుంటూ తన రూమ్ వైపు వెళ్ళిపోతున్న అతణ్ని కళ్ళు వెడల్పు చేసి, చూపు నిశితం చేసి మరీ మరీ చూసింది. అతనే – ది గ్రేట్ ఇండియన్ టెన్నిస్ ప్లేయర్ ఫ్రమ్ ఆంధ్రా – రామం. ఇన్నాళ్లు తమ ఇంట్లో వెనుక వైపు వున్న బాచిలర్స్ రూమ్‌లో శంకరంతో పాటు ఈ 'రామం' వుంటున్నాడని గ్రహించనందుకు ఒక్క క్షణం పశ్చాత్తాపం ఫీల్ అయింది.

మరుక్షణం అసలు తను ఆరాధించే టెన్నిస్ ప్లేయర్ రామం ఇతనేనా అని లేచి వెళ్లి – తను డైరీలో కట్ చేసి దాచుకున్న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సన్‌డే ఎడిషన్ ఆర్టికల్ చూసింది. అందులో వింబుల్డన్ ఛాంపియన్ అవ్వగల అర్హతలున్న ఆంధ్రా టెన్నిస్ ప్లేయర్ రామం అమృత్‌రాజ్‌ల అడుగుజాడల్లో విజయం వైపు పయనిస్తున్న రామం వ్యాసం పక్కనే – రామం గొప్ప వీరుడిలా, టెన్నిస్ రాకెట్ పట్టుకుని మొహం నిండుగా ధీమాతో, పెదాలు విడీవిడని రహస్యపు చిరునవ్వుతో వున్న ఫోటోని చూసి 'అతనే' అనుకుంది.

కానీ ఈ ఫోటోలో వున్న వ్యక్తికీ, తను చూసిన స్వరూపానికి వున్న సారూప్యాన్ని – వైరుధ్యాన్ని ఆమె పరీక్షగా ఆలోచించి – 'మార్పు గొప్పగా ఉన్నతంగానే కాదు చాలా దిగజారుడుగా కూడా వుంటుంది' అని ఆ క్షణంలో గ్రహించగలిగింది. తను ది గ్రేట్ ఆంధ్ర టెన్నిస్ ప్లేయర్ రామం అభిమాని – తన అభిమాన హీరో ఇలా వున్నాడేంటి! ఆమె మరిక ఆలోచించలేకపోయింది.

***

తెల్లవారురఝామున–

మంచు తెరలని చీల్చుకుంటూ సారిక గబగబ నడుస్తోంది. ఉదయాన ఇంగ్లీషు ప్రొఫెసర్ దగ్గరకి వెళ్లి ప్రోజ్ క్రిటిసిజమ్ నోట్స్ రాసుకుంటూ వుంటుంది. నడుస్తూ – ఆ దృశ్యం చూసి ఎదురుదెబ్బ తిన్న ఆవుదూడలా, ఆమె తల తిరిగినట్టుగా మరో అడుగు వెయ్యలేక నిలుచుండిపోయింది.

రోడ్డు పక్కనే ఒంటి మీద తెలివి లేకుండా పడి వున్న రామం. అతను వేసుకున్న లాల్చీ, పైజమాల నిండా దుమ్ము, దుర్గంధం.

సరిగ్గా అప్పుడే ఆమె చూస్తుండగా, పాలవాడు హడావుడిగా సైకిల్ తొక్కుతూ రోడ్డు వైపు చాపి వున్న అతడి కుడి చెయ్యి మీద నుంచి పోయాడు. ఒక్కసారిగా ఆమెకి తనని ఒక పెద్ద గద్ద తన్నుకుపోయి, ఆకాశం నుంచి కిందకి వదిలేసినట్టుగా – హృదయం జారిపోయినట్టు అనిపించింది. కానీ రామంలో మాత్రం చలనం లేదు. అతను కుడిచేత్తో టెన్నిస్ రాకెట్ పుచ్చుకుని ఎడం చేత్తో బాల్ పైకెగరేసి ధనసులా వంగి సర్వ్ చెయ్యటం – ఆ కదలికలోని రాజసం చూసి తను గాలరీలో కూర్చుని నిండుగా ఆనందిస్తూ మైమరిచిన క్షణాలు ఆమెకి జ్ఞాపకం వచ్చి – ఎందుకో కళ్లు చెమర్చాయి.

వెళ్లి అతణ్ని లేపడానికి ప్రయత్నించి, తన వల్ల కాక, అటుగా పోతున్న రిక్షావాడి సాయంతో రిక్షాలో వేయించుకుని, రూమ్‌కి తీసుకువచ్చి, పక్క ఇంట్లో అద్దెకి వుంటున్న డాక్టర్‌ని తీసుకువచ్చి, అతణ్ని ఎగ్జామ్ చేయించి, కుడి చేతికి కట్టు కట్టించింది. సహజంగానే డాక్టర్ వెళుతూ – "ఆల్‌రెడీ అతని లివర్ పాడయ్యింది. ఇలాగే విపరీతంగా తాగితే మాత్రం ఎన్ని రోజులో బ్రతకడు –" అని వెళ్లిపోయాడు.

మధ్యాహ్న సూర్యుడు హఠాత్తుగా ఆకాశంలో అస్తమిస్తే ఎలా ప్రపంచం కన్నుమిన్ను కానక తల్లడిల్లుతుందో సారిక అలా తత్తరపడింది ఆ విషయం విని. తన కళ్లముందే, తన అస్తిత్వాన్ని పోగొట్టుకుంటూ కరిగిపోతున్న ఈ పాతికేళ్ల యువకుడ్ని చూస్తూ – 'అలా జరగడానికి వీల్లేదు' అనుకుంది.

శంకరం ప్రేక్షకుడిలా మిగిలిపోవడం ఆమె గమనించింది.

రామాన్ని వ్రేళ్ళతో



సహా పెకిలించి ఆరోగ్యకరమైన వాతావరణంలో నిలబెట్టగలగాలంటే – అలా చెయ్యగలిగే వ్యక్తికి బలమైన వ్యక్తిత్వం, రామాన్ని ప్రభావితం చేసే అరుదైన పరిపూర్ణత్వం వుండాలని ఆమె గ్రహించింది. అవి లేనందువలవే రామం మిత్రులు బొమ్మల్లా మిగిలిపోయారు అనుకుంది.

***

రామానికి మెలకువ రాగానే, ముందు తన ఎదురుగా లేత గులాబీ రంగు తామర మొగ్గలాంటి ఆమెని చూస్తూ కంగారుపడ్డాడు. సారిక విషయమంతా చెప్పి – "నాకు మీ ప్రవర్తన నచ్చలేదు–" అంది.

రామం ఈ అపరిచితురాలు తీసుకుంటున్న అతిచనువుకి నివ్వెరపోయాడు. కానీ అతని కెందుకో ఆమె తీసుకుంటున్న 'చనువు' అతి సహజంగా కనిపించి – ఎందుకు? అని ఆలోచించుకుని తనలో తను నవ్వుకున్నాడు.

"మీ వేదాంత ధోరణి – పిచ్చి వ్యవహారం బావుండలేదు. మీకు మీ శరీ

తానికి ఏం జరుగుతోందో అనే స్పృహ అయినా లేకుండా తోడ్డు మీద అలా పడివున్నారంటే –"

అని ఆగింది.

"స్పృహ పోగొట్టుకోవడానికేగా నేను ప్రయత్నిస్తున్నా–"

"దాని వల్ల ప్రయోజనం లేదు. అది తాత్కాలికమే అని మీకు తెలీదూ?"

"పోనీ శాశ్వతమైనది ఏదో మీరు చెబుతారా?" ఒక రకమైన వ్యంగ్యంతో అతను అన్నాడు.

సారిక మాత్రం నిజాయితీగా – "తప్పకుండా. నాకు తెల్సినంతవరకు–" అంది.

ఆమె నిజాయితీ విలువని గ్రహించి – తను ప్రయోగించిన వ్యంగ్యానికి రామం సిగ్గుపడ్డాడు.

తర్వాత –

***


"ఒళ్ళెలా వుంది?"


అతను నివ్వెరపోయాడు.

"అదే! ఆరోగ్యం ఎలా వుంది?" అని.

రామం నవ్వేశాడు – సారిక మాటల్లోని అల్లరి గ్రహించి.

ఆమె కుర్చీలో కూర్చోకుండా – సరాసరి వచ్చి రామం పడుకున్న మంచం మీదనే కూర్చుని అతని మీదుగా వంగి దిండు కింద చెయ్యి పెట్టి, హాఫ్ బ్రాంది బాటిల్‌లో వున్న సగం ద్రవం ఒకసారి వూపి చూసి – బయటకు





వెళ్ళి, గోడ బయటకు డస్ట్‌బిన్‌లోకి విసిరింది.

సారిక అలా చేస్తున్నప్పుడు, అతని మొహంలో రకరకాల భావాలు మారుతున్నాయి. గిల్టీనెస్, చిన్న విసుగు, మరింత కోపం, అప్పుడే పశ్చాత్తాపం.

సారిక లోపలికి వచ్చి కూర్చుంటూ - "రామ్! అలవాటుని ఒకేసారి మానుకోవడం కష్టమే!"

"అసలు నేనెందుకు మానుకోవాలి" అన్నాడు ఉక్రోషంగా.

"నీ కోసం"

"అయితే నేను మానలేను. నాకు ఏదో మరో బలమైన మానసిక ఆలంబన కావాలి - లేకపోతే..."

"రామ్, ఎటువంటి ఆలంబన కావాలి-"

అతను నిట్టూర్చి - "మా వదిన-" అంటూ లేచి - ఇంకా గాయం ఆరని కుడిచేతిని ఒకసారి చూసుకుని గదిలో అటు ఇటు పచార్లు చెయ్యసాగాడు.

ఆమె అతడ్ని పరిశీలనగా చూస్తూ - "మీ వదిన ఇచ్చిందిగా-" అంతకు క్రితం చాలా సార్లు రామం వదిన - తన మధ్య జరిగిన సంఘటనలన్నీ వెయ్యి మార్లు వర్ణించి వుంటాడు సారికకి.

"వదిలేసిందిగా-"

"ప్రతీ ఒక్కరికీ వాళ్ళ వాళ్ళ పరిధులు వుంటాయి రామం-"

"అంతకు ముందు ఆవిడకి తెలీదా ఆ విషయం - నన్ను దగ్గరకు చేర్చి ఆపేక్షని చూపించినప్పుడు"

సారిక చిన్నగా నిట్టూర్చింది. పసిపిల్లవాడు ఎంత ఓదారుస్తున్నా, తన బాధతో తను గుక్కపెట్టి ఏడుస్తుంటే - తల్లి ఏం చెయ్యాలో తెలీక, పిల్లాడి బాధకి కదిలిపోతూ, తన నిస్సహాయతకి నిట్టూర్చే నిట్టూర్పు అది.

"రామ్. ఎంతసేపూ నీ గురించే ఆలోచిస్తావేం? భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడు చుట్టూ తిరిగినప్పుడే - భూమికి చీకటి వున్నా వెలుతురూ వస్తుంది. ఆ పంథాలో ఒకసారి మీ వదిన వైపు ఆలోచించు"

అతని మొహం వెలవెలపోయింది.

"మా వదిన గురించి ఆలోచించేదేవిటి? తనే నన్ను దగ్గరకు తీసుకుని ఆ దగ్గరితనానికి, ఆత్మీయతకి అలవాటుపడిన నన్ను మళ్ళీ నిర్లక్ష్యంగా వదిలేసింది"

"రామ్. ఎలా నువ్వు నీకు ఆలంబన కావాలనుకున్నావో, అలానే మీ వదిన కూడా నిన్ను ఆలంబన చేసుకోవాలనుకుంది"

"నన్నా?"

"కొత్తగా కాపరానికి వచ్చిన ఆమె కొత్త వాతావరణంలో ఒక ఇల్లాలిగా, గృహిణిగా నిలదొక్కుకోవడానికి నిన్ను ఆలంబన చేసుకుంది. కారణం దగ్గర భర్త లేకపోవడం, నువ్వు భర్త తమ్ముడివి అవ్వడం. ఆమె మానసికంగా ఎప్పుడో భర్త - పిల్లలు - ఇల్లుకి, ఇల్లాలిగా ఫిక్స్ అయిపోయింది. అందులో వదిన పాత్ర అతి చిన్నది. నువ్వు దాన్ని బ్లోఅప్ చేసుకుని సఫర్ అవుతున్నావు. అంతే!"

రామం నిలువడిపోయి తన జీవ శక్తులన్నీ నీరు కారిపోతున్నట్టుగా సారిక వైపు చూశాడు. అతనెప్పుడూ ఇలా ఆలోచించలేదు.

అతని పాలిపోయిన మొహం చూసి ఆమె లోలోపల బాధపడింది. కానీ ఇలా మాట్లాడకపోతే - అతను ఎప్పటికీ ఆ ఊబిలోనే ఇరుక్కుపోయి వుంటాడు.

"నన్ను కేవలం చంద్రం తమ్ముడిగా, తన మరిదిగానే చూసిందా? అంతకు మించి నాకు తన దృష్టిలో వ్యక్తిగా ప్రాముఖ్యత లేదా?-"

"మొదట వైదేహి నిన్ను అంగీకరించింది మరిదిగానే. తర్వాత నీ పసిపిల్లవాడి మనస్తత్వం, స్వచ్ఛత ఆమె నిన్ను ఆపేక్షగా దగ్గరకు తీసుకుని తల్లిగా ప్రేమించడానికి కారణమయ్యింది-".

(మిగతా వచ్చే సంచికలో)


మీ భవిశ్యత్తును తెలుసుకోండి

భవిశ్య ఫోన్

వారఫలాలు

001 609 936 30 +

పైన ఇచ్చిన మొత్తం పదకొండు అంకెలకు మీ సూర్యరాశికి ఎదురుగా ఇచ్చిన రెండు అంకెలను కలిపి వరుసగా డయల్ చేయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 51 | 52 | 53 | 54 | 55 | 56 |
| మేషం | వృషభం | మిథునం | కర్కాటకం | సింహం | కన్య |
| 57 | 58 | 59 | 60 | 61 | 62 |
| తుల | వృశ్చికం | ధనుస్సు | మకరం | కుంభం | మీనం |

టారట్
జాతక ఫలాలు

ఇది జాతక ఫలాలను చెప్పే ప్రాచీన పద్ధతి. మీరు అడిగే నిర్దిష్టమైన ప్రశ్నలకు సమాధానాలు యిస్తుంది.

ఫోన్ చేయండి:
001 609 936 3067

రాశి కలయిక

మీరు, మీ జీవిత భాగస్వామి ఎంత అన్యోన్యంగా ఉంటారు?

ఫోన్ చేయండి:
001 609 936 3063

ఇది ఇంటర్నేషనల్ కాల్. నిర్దిష్టమైన ధరలు వర్తిస్తాయి వరల్డ్ ఫోన్ యు.ఎస్.ఎ.